క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగేశ్వరరావు

వాల్మీకిపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాల్మీకిపురం ఎస్‌ఐ నాగేశ్వర రావు అన్నారు. బుధవారం స్థానిక స్వతంత్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పౌష్టికాహారం, రక్తహీనత, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు హసీనా, రమణమ్మ, శోభారాణి, సుధారాణి, వేదవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

పీలేరు రూరల్ : మండలంలో 20 లీటర్ల సారాతోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. జాండ్ల పంచాయతీ అవులయ్యగారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగరాజ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద్, సుధాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలికలు చదువులో రాణించాలి

మదనపల్లె సిటీ : బాలికలు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం పురస్కరించుకుని ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల కోసం అమ్మ ఒడి, విద్యాకానుక, స్వేచ్ఛ వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు బాలికలను చదివించాలన్నారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ బాలిక చదువు దేశానికి వెలుగన్నారు.బాలికలు సైబర్ క్రైమ్,మోసగాళ్లకు దూరంగా ఉండి పుస్తకాలు చదివి నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భువనేశ్వరి, మోటివేటర్ రామమూర్తి, ఫోర్డు సిబ్బంది అల్తాఫ్, రమేష్, జ్యోతి పాల్గొన్నారు. అనంతరం బాల్యవివాహాలు నిషేద్దాం, చదువుకుని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

జ్ఞానాంబిక కళాశాలకు ఎడ్యు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి

మదనపల్లె : రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రసస్వద- ది అప్రిషియేషన్-2023 కార్యక్రమంలో పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించినందుకు ఎడ్యు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. బుధవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్ససత్యనారాయణ, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను ఎంపిక చేయాలి

మదనపల్లె సిటీ: ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను ఎంపిక చేయాలని ఎంపీపీ రెడ్డమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 ప్రణాళికల తయారీ, పనుల ఎంపికలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీల సహకారంతో క్షేత్రస్థాయి పరిశీలన చేసి పనులు గుర్తించాలన్నారు. రైతులకు అవసరమైన భూమి అభివృద్ధి, పండ్లతోటల పనులు ,గ్రామాల్లో మౌలిక వసతులు, నీటి సంరక్షణ, నీటి నిల్వ ఉపయోగాలను గుర్తించాలన్నారు. నవంబర్ 15 నాటికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుబ్రమణ్యం, సీఎల్ఆర్‌సి సీడీ చందన, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రామసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారంతో గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీపీఓ , ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మీ తెలిపారు. బుధవారం ఆమె కమ్మవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించి పండ్లు, పలహారాలు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలన్నారు.

సొంతింటి కల సాకారం

- ప్రారంభానికి సిద్ధమైన వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ
- నేడు వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ ముఖద్వారం

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని మదనపల్లి రోడ్డు సీఎల్ఆర్‌సీ కార్యాలయ సమీపంలో వైఎస్ఆర్ జగనన్న కాలనీ (సీఎల్ఆర్‌సీ లేఅవుట్) ప్రారంభానికి సిద్ధమైంది. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం వర్చువల్ విధానం ద్వారా కాలనీని ప్రారంభోత్సవం చేయనున్నారు. కాలనీ లేఅవుట్‌లో 111 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా అందులో 60 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. 27 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. మరో 24 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తయ్యాయి. వంద శాతం నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. లేఅవుట్‌లో 50 శాతం పైగా ఇండ్ల నిర్మాణాలు పూర్తికావడంతో మౌలిక వసతుల కల్పన దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.21లక్షల నిధులతో మెటల్ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రూ.4లక్షల నిధులతో ఇంటింటికి తాగునీటి కుళాయిలు, పైపులైన్‌లు పూర్తి చేశారు. కాలనీకి ఒక బోరు మాత్రమే ఉండటంతో రూ.9లక్షల నిధులతో మరో తాగునీరు బోరు ఏర్పాటు చేశారు. త్వరలో మోటారు, పైపులు అమర్చనున్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ఇలా కాలనీలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తుండటంతో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసినా ఇండ్లు లేక బాడుగ ఇండ్లలో నివాసం ఉండే వారమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం అర్హతే ప్రామాణికంగా ఇండ్లు కేటాయించారన్నారు.

పదేళ్లుగా సొంతింటి కోసం వేచిచూశాం



వివాహమై పదనాలుగు సంవత్సరాలైంది. అప్పటి నుంచి కలికిరి పట్టణంలో నివాసం ఉంటున్నాం. బాడుగ ఇంటిలో ఉండేవాళ్ళం. అప్పటి నుంచి ఇంటి కోసం లెక్కలేనన్ని సార్లు దరఖాస్తులు చేసుకున్నాం. మాకు ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా మాకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. వెంటనే ఇల్లు నిర్మించుకున్నాం. సీఎం జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. – ఎ.సుశీల, వైఎస్ఆర్ జగనన్న కాలనీ, కలికిరి

సిఫారసు లేకుండా ఇల్లు మంజూరు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో మాకు ఇల్లు మంజూరైంది. ఏలాంటి సిఫారసులు లేకుండా మా అర్హతను బట్టి మాకు ఇల్లు మంజూరు చేశారు. దగ్గరుండి నిర్మాణాలు పూర్తి చేసుకున్నాం. కొన్ని సంవత్సరాలు సొంతింటి కోసం ఎదురుచూసిన మాకు సొంతింటి కోరిక నెరవేరింది. మాలాంటి ఎంతో మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – ఎం.డీలత, వైఎస్ఆర్ జగనన్న కాలనీ, కలికిరి

లేఅవుట్ ప్రారంభోత్సవ పనుల పరిశీలన

కలికిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభంకానున్న కలికిరి వైఎస్ ఆర్ జగనన్న కాలనీ(సీఎల్ఆర్‌సీ) లేఅవుట్ ప్రారంభోత్సవ పనులను బుధవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు, హౌసింగ్ జిల్లా పీడీ సాంబశివయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా పేదల ఇంటి నిర్మాణాలకు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఊర్లు నిర్మించడం జరిగిందని, గురువారం ఒక్క రోజే రాష్ట్రంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 5లక్షల ఇండ్లు ప్రారంభించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ గోపాల్ నాయక్, పంచాయతీ రాజ్ శాఖ డీఈ భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ వేణుగోపాల్, ఏఈ చంద్రయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు వెంకటేష్, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ ఆర్చి వద్ద హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న భాస్కర్‌నాయుడు

భూ ఆక్రమణలు అడ్డుకోవాలని ధర్నా

బి.కొత్తకోట : మండలంలోని బీరంగి గ్రామ పరిధిలోకి వచ్చే మోడల్ స్కూల్ వద్ద పెయింటర్స్ కాలనీలో ఇంటి స్థలాల ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వడ్డెర సంఘ నాయకులు నారాయణ మాట్లాడుతూ సర్వే నంబర్ 58/1, 58/2లో ఇంటిస్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ రఫీక్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఈ స్థలాలపై సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రఘునాథ్, అష్రఫ్‌అలీ, చిన్నరెడ్డెప్ప, ఆదినారాయణ, నారాయణస్వామి, బాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ మధు

పెద్దమండ్యం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ములకలచెరువు సీఐ మధు బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గ్రామాలు, సమస్యల గురించి ఆరా తీశారు. ఎక్కడా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్‌లు, సస్పెక్టెడ్‌షీట్‌లు ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నాటుసారా తయారీ, కోడిపందెం, జూదం నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

48 కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి క్రాస్ రోడ్డులో ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లి పంచాయతీ మొరుసుపల్లికి చెందిన బాలిరెడ్డిగారి జనార్దన్‌రెడ్డి (45) కర్ణాటక రాష్ట్రానికి చెందిన 90 మిల్లీల 48 మద్యం ప్యాకెట్లను సంచిలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గాయత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని దేవులచెరువు పంచాయతీ శివరాంపల్లెకు చెందిన డి.గెంగినాయుడు(42) కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 35 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సమాజంలో సత్‌ప్రవర్తనతో మెలగాలి

గుర్రంకొండ : రౌడీషీటర్లు సమాజంలో సత్‌ప్రవర్తనతో మెలగాలని కలకడ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో రౌడీ షీటర్లకు, గంజాయి ముఠా సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో దౌర్జన్యకాండలకు దిగడం చట్టరీత్యా నేరమన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రశాంత జీవనానికి అలవాటు పడి నేరాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇప్పటికే పలుమార్లు గంజాయి కేసుల్లో జైలుకు పోయి వచ్చిన వారు పద్ధతి మార్చుకోవాలన్నారు. గంజాయి తాగడం మానితే మనిషి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ దిలీప్‌కుమార్

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

బి.కొత్తకోట: స్థానిక ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలపై బుధవారం కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం దాడులు నిర్వహించింది. సీఐ ఈదుర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. దుకాణాల్లో స్టాక్ మేరకు ఎరువులు, వాటి నిల్వ, పురుగు మందుల విక్రయాల ధర, ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారా అన్న వాటిపై తనిఖీలు నిర్వహించి పరిశీలించారు. వీటిలో నిబంధనలకు విరుద్ధంగా గుర్తించిన శ్రీలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.60వేల విలువైన ఎరువులు, శ్రీచౌడేశ్వరీ ట్రేడర్స్‌లో రూ.1.20 లక్షల విలువైన పురుగుల మందుల విక్రయాలను నిలుపుదల చేస్తూ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ దాడుల్లో సీఐ బాలగంగాధరరెడ్డి, ఏఈ విజయకిషోర్, ఏఓ జే.చంద్రశేఖర్, సిబ్బంది జనార్ధనరావు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 21న నిర్వహించనున్న ప్రత్యేక లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. గాయత్రి అన్నారు. బుధవారం స్థానిక కోర్టులో తహశీల్దార్లు, న్యాయవాదులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష



రామసముద్రం : జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమకుమారి



పెద్దతిప్పసముద్రం : మడుమూరులో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



వాల్మీకిపురం : మందుల కిట్ పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

రామసముద్రం : దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష అని నాయకులు పేర్కొన్నారు. బుధవారం రామసముద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి , మాజీ వైసీపీ మండల కన్వీనర్ భాస్కర్‌గౌడు, సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, జిల్లా వైసీపీ ఎగ్జిక్యూటివ్ మెంబరు కొండూరు కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ నందరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

పంచాలమర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష

తంబళ్లపల్లె : మండలంలోని పంచాలమర్రి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు అనుపమ, మునికుమార్, నర్సులు పలు రకాల పరీక్షలతో ప్రజలకు వైద్య చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు నాగేంద్రబాబు, సుగుణమ్మ, ఎంపీడీవో సురేంద్రనాథ్, మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

కురబలకోట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రబల్లెలో గ్రామ సర్పంచ్ ఉప్పతి నాగరత్న, ఆగ్రామ ఇన్‌చార్జి ఉప్పతి ఈశ్వర్ ఎంపీటీసీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష

పెద్దతిప్పసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్ష అని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ అన్నారు. బుధవారం మండలంలోని మడుమూరులో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు అందుకున్నారు. సర్పంచ్‌లు నాగరత్నమ్మ, రామాంజులు, ఎంపీటీసీ పద్మావతి, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌తో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కలకడ : పేదలు అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష గొప్పవరమని ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక అన్నారు. బుధవారం మండలంలోని గంగాపురం సచివాలయం పరిధిలోని కత్తివారిపల్లె గ్రామంలో ఏర్పాటు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, వైఎస్సార్‌సీపీనాయకులు శ్రీనివాసులురెడ్డి, కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

కలికిరి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. మండలంలోని గుండ్లూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 351 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 21 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు.

548 మందికి వైద్య సేవలు

పీలేరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 548 మందికి వైద్య సేవలు అందించినట్లు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అగ్రహారంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

ములకలచెరువు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సాయిలీలా, సర్పంచు వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సెంట్రల్‌స్కూల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేసినట్లు చెప్పారు. వైద్యులు జాహ్నవిరెడ్డి, కార్యదర్శి ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

కేవీపల్లె : ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మారేళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం తోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

వాల్మీకిపురం : పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మండలంలోని కూరపర్తి సర్పంచ్ పులి చిట్టెమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కూరపర్తిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సెక్రటరీ పాండు, సూపర్‌వైజర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే ధ్యేయం

ఘనంగా మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



పీలేరులో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వాల్మీకిపురం : పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా రాష్ట్ర విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని నాయకులు కొనియాడారు. బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. అలాగే మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, రఘు, చికెన్‌మస్తాన్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : అలుపెరగని నాయకుడు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులు, భూగర్భశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో మంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేకు అంకితమయ్యారన్నారు. కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, నాయకులు డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు కేవీపల్లెలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని గర్నిమిట్టలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు యర్రంరెడ్డి, రామకొండారెడ్డి, పాత్తపు సతీష్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, అప్పిరెడ్డి, నాగ తదితరులు పాల్గొన్నారు.

కలకడ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను కలకడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కేక్‌కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి(బాబురెడ్డి), మండల ఆర్‌బికె చైర్మన్ హరినాథరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మాత్యులు పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కలికిరిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రాస్ రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు, ముస్లిం జేఏసీ వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కేక్ కట్ చేసి, మంత్రి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, పీపీసీఎస్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జన్మదిన కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల కన్వీనర్ చౌడేశ్వర్, మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జమాల్‌బాషా, వైస్‌ఎంపీపీ కరీమ్, నాయకులు గంట్ల సురేంద్ర, బాలక్రిష్ణ, రమణారెడ్డి, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పడమటి నియోజకవర్గాల అభివృద్ధి ప్రదాత పెద్దిరెడ్డి

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పడమటినియోజకవర్గాల అభివృద్ధికి అటవీ, పర్యావరణ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విశేషకృషి చేస్తున్నారని చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ తట్టి శారదమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి అన్నారు. బుధవారం మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, నాయకులు వెలుగుచంద్ర, తట్టిశ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్‌చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డులో కేక్ కట్‌చేసి రైతులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రామసముద్రం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను జెడ్పీ హైస్కూల్‌లో ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీటీ రామచంద్రారెడ్డి, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌గౌడు, సింగిల్‌విండో కేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబరు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ నంద, బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మయ్య, కోలాహరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పురుషులతో సమానంగా రాణించాలి

మదనపల్లె సిటీ : బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 39వ వార్షికోత్సవం జరిగింది. ఆమె మాట్లాడుతూ కాలేజీలో అభ్యసించిన విద్యార్థినులు ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. కాలేజీలో విద్యతో పాటు క్రీడలతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చురుగ్గా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వ్యాసరచన,వక్తృత్వ,చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం కాలేజీలో మినరల్ వాటర్‌ప్లాంటు ఏర్పాటుకు సహకరించిన దాత ముణుప్పరం బ్యాంకు మేనేజర్ కేశవ్‌ను సన్మానించారు.

మానసిక సమస్య ఉన్నవారికి అండగా నిలవాలి

తంబళ్లపల్లె: మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి తోడుగా నిలబడి ఆప్యాయత, అనురాగాలు పంచాలని మండల న్యాయసేవ సంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధపడుతున్న పిల్లలు, పెద్దల వారికి మనం అన్ని విధాలా సహకారం ఇవ్వాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సదస్సులో డాక్టర్లు వెంకట్రామయ్య, విక్రాంత్‌రెడ్డి, సుమలత తదితరులు పాల్గొన్నారు.